సాక్షి విశాఖపట్నం

ఆదివారం ; 11 ; జూన్ ; 2023



తగ్గేదేలే! 8లో

ఎండలు తాట తీస్తుండగా.. చికెన్ ధరలు సెగలు పుట్టిస్తున్నాయి. లైవ్ రూ.172, స్కిన్ రూ.314, స్కిన్ లెస్ రూ.324కు చేరుకుంది.



సింథియా: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆక్వా యోగా పేరుతో ప్రత్యేక ఆక్వాటిక్ సెషన్ నిర్వహించారు.



వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్

డాక్టర్ కోట హరినారాయణకు గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్), నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ (డీలిట్)ను అందజేశారు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న తమిళిసై

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు ఆమెకు అందజేశారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శేషసాయికి స్వాగతం



జస్టిస్ శేషసాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : రాష్ట్ర హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి ఎ.వి.శేషసాయి ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం విశాఖ చేరుకున్నారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ వద్ద కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

సింహాచలం ఇన్‌చార్జి ఈవోగా భ్రమరాంబ



సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి 15 రోజులపాటు ఈవోగా దర్భముళ్ల భ్రమరాంబకు బాధ్యతలు(పూర్తి అదనపు బాధ్యతలు) అప్పగిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ద్వారకా తిరుమల దేవస్థానం ఈవోగా ఉంటూ సింహాచలం దేవస్థానానికి ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వహిస్తున్న వి.త్రినాథరావు ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు సెలవు పెట్టారు. దీంతో ఆయన స్థానంలో విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవో భ్రమరాంబకు బాధ్యతలు అప్పగించారు. కాగా సింహాచలం దేవస్థానానికి పలుమార్లు భ్రమరాంబ ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వర్తించారు.

వారణాసి స్పెషల్ రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-వారణాసి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును మరో రెండు వారాల పాటు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-బెనారస్ (08588) వీక్లీ స్పెషల్ రైలు (ప్రతీ బుధవారం) ఈ నెల 21, 28వ తేదీ వరకు, తిరుగుప్రయాణంలో బనారస్-విశాఖపట్నం (08587) వీక్లీ స్పెషల్ (ప్రతీ గురువారం) ఈనెల 22,29వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వివిధ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. ఏడాది కాలవ్యవధి కలిగిన డిప్లమో ప్రోగ్రాం ఇన్ జీఐఎస్ అండ్ రిమోట్ సెన్సింగ్, ఎగ్జిక్యూటివ్ డిప్లమో ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు. పూర్తి వివరాలకు ఆర్ట్స్ కాళాలలోని సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చు. 90100 71390, 79812 92239లో మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

మండిన సూరీడు



- నగరంలో 44.6 డిగ్రీల నమోదు
- 1995 జూన్ 9న 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- 28 ఏళ్ల తర్వాత అత్యధికం
- మరో రెండ్రోజులు నిప్పుల కుంపటే..

సాక్షి, విశాఖపట్నం: **విశాఖ విలవిల్లాడింది. అగ్ని** గుండాన్ని తలపించే **ఉష్ణతాపంతో అల్లాడిపోయింది.** నగరంలో దాదాపు **మూడు దశాబ్దాల్లో ఎన్నడూ** లేనంతగా శనివారం **నిప్పుల కుంపటిని తలపించింది.** అప్పుడెప్పుడో 1995 జూన్ 9న విశాఖ (ఎయిర్‌పోర్టు)లో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఇప్పటివరకూ నగర చరిత్రలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. 28 ఏళ్ల తర్వాత జూన్ నెలలో మళ్లీ అదే స్థాయిలో ఇప్పుడు 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు శనివారం వాల్తేరులో నమోదైన 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత కూడా ప్రత్యేకతను చాటుకుంది. ఇది సాధారణం కంటే ఏకంగా 11 డిగ్రీలు అధికం. 1978 మే 9న వాల్తేరులో 42 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత చోటుచేసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు 43.4 డిగ్రీలతో సరికొత్త రికార్డు సృష్టించినట్టు ఐఎండీ సైతం వెల్లడించింది. ఈ మధ్యకాలంలో విశాఖలో ఇంతటి అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు కాకపోవడం విశేషం! గడిచిన మూడు రోజులుగా వడగాడ్పుల తీవ్రత కొనసాగుతూనే ఉంది. విశాఖలో గరిష్టంగా 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. శనివారం మరింత తీవ్రరూపం దాల్చి 44.6 డిగ్రీలకు చేరుకుంది. **ఇది సాధారణంకంటే 9.5 డిగ్రీలకు పైగా అధికం** కావడం, రాష్ట్రంలో విశాఖలో తప్ప మరెక్కడా ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కాకపోవడం మరో విశేషం!

అసాధారణ ఉష్ణోగ్రతలివి..

సాధారణంగా మే నెలలో ఎండ ప్రచండంగా మారి వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులకు దారితీస్తుంది. జూన్ మొదటి వారం వచ్చేసరికి తగ్గుముఖం పట్టి కాస్త ఉపశమనం కలిగిస్తుంది. కానీ పరిస్థితి ఇప్పుడలా లేదు. మృగశిర కార్తె ప్రవేశించిన జూన్ రెండో వారంలోనూ రోహిణి కార్తెను మించిన ఎండలు దడ పుట్టిస్తూ అసాధారణ ఉష్ణోగ్రతలకు కారణమవుతున్నాయి. మునుపెన్నడూ లేనంతగా జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. శనివారం నాటి భానుడి భగభగలకు జనం మలమలా మాడిపోయారు. అగ్నికీలల మధ్య నుంచి పయనించిన అనుభూతి పొందారు. చాలా వాహనాల్లో ఇంధనం ఆవిరైంది. చెట్ల కింద సేద తీరినా సెగలు తగ్గలేదు. వామ్మో.. ఇలాంటి ఎండలను ఎప్పుడూ చూడలేదంటూ నిట్టూర్చారు. ఘన ఆహారానికి బదులు అదే పనిగా నీళ్లు, ఇతర ద్రవపదార్థాలు సేవించి ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి విఫలయత్నం చేశారు.



ఎండ నుంచి ఛత్రం రక్షణగా..



ఎండకు బేరాలు లేక నిరాశలో ..



నిర్మానుష్యంగా జగదాంబ జంక్షన్

శనివారం నాటి ఉష్ణతాపం ఇలా.. (డిగ్రీల్లో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
పద్మనాభం	44.7
ఎయిర్‌పోర్టు	44.6
గాజువాక	44.6
నారాయణరాజుపేట	44.5
గంగవరం	44.3
గంభీరం	44.3
మహారాణిపేట	44.2
డైరీఫారం	43.7
కాపులుప్పాడ	43.7
సింహాచలం	43.1

ఎందుకిలా..?

ప్రస్తుతం విశాఖ వైపునకు వాయవ్య దిశ నుంచి పొడి గాలులు వీస్తున్నాయి. అరేబియా సముద్రంలో 'బిపార్‌జాయ్' తుపాను, ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతున్నాయి. ఈ రెండూ గాలిలో తేమను తమవైపునకు లాక్కుపోతున్నాయి. దీంతో తేమలేని పొడి గాలులు ఉష్ణ తీవ్రతను పెంచి తీవ్ర వడగాడ్పులకు దారి తీస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరో రెండ్రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇదే వాతావరణ పరిస్థితి కొనసాగుతుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి ఒకరు 'సాక్షి'కి చెప్పారు.

జర్నలిస్టుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- అక్రిడేటెడ్ జర్నలిస్టులకు 56 రకాల వైద్య పరీక్షలు ఉచితం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కలెక్టర్ మల్లికార్జున, డాల్ఫిన్ డయాగ్నస్టిక్ సెంటర్ సీఎండీ సురేష్, ఈడీ లక్ష ప్రసూన

మహారాణిపేట: సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని డాల్ఫిన్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా జర్నలిస్టులు విలువల కోసం పనిచేస్తారని, వారి ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని డాల్ఫిన్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రూ.10,000 పైబడి ఖరీదు చేసే 56 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమయ్యే చికిత్సను ఉచితంగా ఉందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల కోసం మరిన్ని ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 495 మంది జర్నలిస్టులకు రెండు విడతలుగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. తెల్లరేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి బీమా మొత్తాన్ని సీఎస్సార్ నిధులతో చెల్లిస్తున్నట్లు తెలిపారు. 10 రోజుల పాటు వైద్య పరీక్షలు చేస్తామని, అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులంతా ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని డాల్ఫిన్ సీఎండీ డాక్టర్ వి.సురేష్ కోరారు. అనంతరం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, 'వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్'కు సంబంధించి రూ.3,75,000 చెక్కును మంత్రి, అతిథులు అందజేశారు. జర్నలిస్టు హెల్త్ కార్డులను అందించారు. వైద్య పరీక్షల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్, ప్రముఖ రేడియాలజిస్ట్ వి.ప్రసూన, కార్పొరేటర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు లిఫ్ట్ ఎక్కారు. కిందకు దిగుతుండగా.. ఓవర్ లోడ్ కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. సిబ్బంది సకాలంలో స్పందించి.. ఎమర్జెన్సీ కీతో లిఫ్ట్ తెరిచారు. దీంతో మంత్రి సురక్షితంగా బయటపడ్డారు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చెత్త సేకరణకు ఈ-ఆటోలు



ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభిస్తున్న మంత్రి రజిని



దివ్యాంగులకు వాహనాలు అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి రజని, ఎంపీ ఎంవీవీ తదితరులు

బీచ్‌రోడ్డు: పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. ఇంటింటా చెత్త సేకరణలో భాగంగా జిల్లాకు కేటాయించిన 65 ఎలక్ట్రిక్ ఆటోలను బీచ్‌రోడ్డులో శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియాకు చెందిన అర్బన్ క్లైమేట్ చేంజ్ రెసిలెన్స్ ట్రస్ట్ ఫండ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ తీసుకొచ్చాయన్నారు. వీసీఐసీడీపీ పథకంలో భాగంగా నాలుగు స్వైపింగ్ కమ్ సర్వీస్ స్టేషన్లను ముడసర్లోవ, శాంతి ఆశ్రమం, టౌన్ కొత్తరోడ్డు ప్రాంతాల్లో నిర్మించినట్లు తెలిపారు. 180 లిథియం అయాన్ స్మార్ట్ బ్యాటరీలను సిద్ధం చేశామన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, కలెక్టర్ మల్లికార్జున, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ

మహారాణిపేట : కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో 60 మంది దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలను మంత్రి విడదల రజిని పంపిణీ చేశారు. ఒక్కొక్క వాహనం విలువ రూ.లక్ష అని, వికలాంగులు, వయోవృద్ధుల సహకార సంస్థ ద్వారా అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేసి.. వారికి అందజేసినట్లు మంత్రి తెలిపారు.

వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం

జీవీఎంసీ 48వ వార్డులోని ఇందిరానగర్‌లో రూ.106.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మంత్రి విడదల రజిని ప్రారంభించారు. ఇక్కడ 63 రకాల వైద్య పరీక్షలు చేస్తారని, 19 మంది వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

కేంద్ర హోంమంత్రి పర్యటనకు భారీ భద్రత

950 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనకు నగర పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. ఆదివారం ఆయన విశాఖలో పర్యటించడంతో పాటు రైల్వే గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు డీసీపీలు, రెండు ఏపీఎస్పీ ప్లటూన్లు, 4 స్పెషల్ పార్టీలతో మొత్తంగా 950 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు కల్పిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ శనివారం సమావేశం నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమిత్ షా పర్యటించే ప్రాంతాలైన ఐఎన్ఎస్ డేగ, ఎయిర్‌పోర్ట్, వాల్తేరు రైల్వే గ్రౌండ్స్, బస చేసే పోర్ట్ అతిథి గృహం, సాగర్ మాల కన్వెన్షన్ సెంటర్ వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలతో పాటు బహిరంగ సభ జరిగే రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

- బహిరంగ సభకు వచ్చే బస్సులు తాటిచెట్లపాలెం 28 బస్టాప్ వద్ద ఆశీర్వాద కల్యాణ మండపం వైపు ఉన్న రోడ్ మార్జిన్‌లోను, డీఎల్‌బీ గ్రౌండ్స్‌లోను, విశాఖ పోర్ట్ హాస్పిటల్ వద్ద ఉన్న ఇనార్బిట్ మాల్ గ్రౌండ్స్‌లో ప్రజలను దించి అక్కడే పార్కు చేసుకోవాలి.
- బహిరంగ సభకు వచ్చే ద్విచక్ర వాహనాలు తాటిచెట్లపాలెం 28 బస్టాప్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి. ఆటోలు కేంద్రీయ విద్యాలయం వరకు గల 80 ఫీట్ రోడ్ మార్జిన్‌లో నిలపాలి.
- కంచరపాలెం మెట్టు నుంచి అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో ఉన్న మహారాణిపార్లర్ వరకు తాటిచెట్లపాలెం నుంచి డీఎల్ఓ జంక్షన్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు.

16 నుంచి కాన్‌టెక్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న రామకోటయ్య

బీచ్‌రోడ్డు: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు బై కాన్‌టెక్ ఎక్స్‌పో-2023 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రామకోటయ్య తెలిపారు. ఈ ఎక్స్‌పో వివరాలను శనివారం అసోసియేషన్ కార్యాలయంలో మీడియాకు వివరించారు. విశాఖపట్నంలో 140 మంది సభ్యుల గల అసోసియేషన్ ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ చేస్తోందన్నారు. కరోనా తర్వాత నిర్మాణ పనుల్లో నూతన ఆవిష్కరణలు వచ్చాయని, వాటిని కాంట్రాక్టర్లకు పరిచయం చేసేందుకు ఈ ఎక్స్‌పో దోహదపడుతుందన్నారు. ఈ ఎక్స్‌పో ద్వారా ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకే యంత్రాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహించే ఈ ఎక్స్‌పోను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభిస్తారని, సుమారు 50 సంస్థలు పాల్గొంటున్నాయని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ విశాఖ చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్‌ల పరిశీలన



ఈవీఎం బాక్సులు పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ఆరిలోవ: జిల్లాలో ఈవీఎం గొడౌన్‌లను కలెక్టర్ ప్రతి నెలా పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రూరల్ మండల కార్యాలయం సమీపంలో ఈవీఎం గొడౌన్‌ను ఆయన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి శనివారం సందర్శించారు. ఇక్కడ గొడౌన్ పటిష్టత, అందులో ఉన్న ఈవీఎం బాక్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నెలకు ఒకసారి సీల్డ్ గొడౌన్‌లను పరిశీలించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సీల్ తీసి లోపల పరిశీలించి ఏమైనా మరమ్మతులు ఉంటే గమనించాలన్నారు. ఎన్నికల సీఈవో కూడా ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్‌తో కలసి ఈవీఎం గొడౌన్‌లను పరిశీలించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే జాగ్రత చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంలో ఆర్డీవోలు భాస్కర రెడ్డి, సాహెబ్, రూరల్ తహశీల్దారు రమణయ్య, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న ఆదాయం రూ.45 లక్షలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి శనివారం ఒక్క రోజు సుమారు రూ.45 లక్షలు ఆదాయం లభించింది. సేవల ద్వారా రూ.79,500, దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.24.73 లక్షలు, డొనేషన్ల ద్వారా రూ.1.17 లక్షలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12 లక్షలు, వసతి ద్వారా 18,600, ట్రాన్స్‌పోర్టు ద్వారా రూ.1.6 లక్షలు, ఇతర మార్గాల్లో మరికొంత ఆదాయం చేకూరింది. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సింహగిరికి భక్తులు పోటెత్తారు. కేశఖండనశాల వద్ద భక్తులు గంటల తరబడి బారులు తీరారు. దర్శన క్యూలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ట్రాన్స్‌పోర్టు బస్సులు, ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. ప్రసాద విక్రయశాల వద్ద భక్తుల క్యూ శ్రీగోకులం వరకు బారులు తీరింది. కాగా ఘాట్‌రోడ్డులో పలుమార్లు పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఘాట్‌రోడ్డు అంతా వాహనాలమయంగా మారింది.

మొక్కలను సంరక్షించాలి



బయో మైనింగ్, వ్యర్థాల విభజనను తెలుసుకుంటున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: నగరంలో మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం విశాఖ ఎయిర్‌పోర్టు జంక్షన్ నుంచి రుషికొండ వరకు పలు ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో విపరీతంగా వడగాడ్పులు, ఎండలు అధికంగా ఉన్నందున రోడ్డు మధ్య భాగంలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా నీరు పోసి కాపాడాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని మొక్కల విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డుకిరువైపులా, మధ్య భాగంలో చాలా చోట్ల, ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో కూడా వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, వాటిని వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. రాత్రి పారిశుద్ధ్య పనులు నిర్వహించే వారు ప్రధాన రహదారులను శుభ్రం చేసి, ఆ వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించి కట్టాలని, వినియోగంలో లేని వైర్లను తొలగించాలని ఆదేశించారు. అనంతరం కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను సందర్శించి జిందాల్, బయో మైనింగ్, వ్యర్థాల విభజన తదితర పనులు పరిశీలించి వాటి వివరాలు తెలుసుకున్నారు.

తగ్గేదేలే!

- కొండెక్కిన కోడి
- కిలో రూ.330
- పౌల్ట్రీలపై ఎండల ప్రభావం



అల్లిపురం: ఎండలు తాట తీస్తుండగా.. చికెన్ ధరలు సెగలు పుట్టిస్తున్నాయి. ఒక్కసారిగా భారీగా ధరలు పెరిగాయి. ఈ నెల ఒకటో తేదీన రైతు ధర రూ.105, లైవ్ రూ.125, స్కిన్ రూ.220, స్కిన్ లెస్ రూ.230 ఉన్న ధర క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం రైతు ధర రూ.152, లైవ్ రూ.172, స్కిన్ రూ.314, స్కిన్ లెస్ రూ.324కు చేరుకుంది. వారం రోజులుగా భానుడు భగభగలు కోళ్ల పెంపకంపై ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు. దీంతో మార్కెట్లో చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. వేసవి కాలంలో కోళ్ల ఉత్పత్తి తక్కువగా ఉండటం కూడా చికెన్ ధరలు పెరగడానికి ఓ కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

కోడి గుడ్డు ధర కూడా..

కోడి మాంసంతో పాటు మార్కెట్‌లో కోడి గుడ్డు ధర పెరుగుతోంది. వారం రోజుల క్రితం రూ.5 గల గుడ్డు ధర ఈ వారం రిటైల్‌గా రూ.6కు చేరుకుంది. ట్రే కోడి గుడ్ల ధర రూ.165కు చేరింది. చికెన్, ఎగ్స్ ధరలు మండిపోతున్నాయని మాంసం ప్రియులు అంటున్నారు.

కోళ్ల పెంపకం నిలిపేశారు..



ఎండకు ఫారం వద్ద కోళ్లు చనిపోతున్నాయని, పిల్లలు కూడా దొరకక పోవడంతో చాలా మంది రైతులు కోళ్ల పెంపకాన్ని నిలిపివేశారు. వేసవి కావడంతో కోడి పిల్లలు ఫీడింగ్ తీసుకోక పోవడంతో బరువు తగ్గిపోతున్నాయి. దీంతో మార్కెట్ లేకుండా పోయింది. ఒడిశాలో కోళ్ల ఉత్పత్తి, కోడి బరువు ఉండటంతో కొంత మంది వ్యాపారులు అక్కడ నుంచి తీసుకువస్తున్నారు. అవి కూడా ట్రాన్స్‌పోర్టులో వేడికి చనిపోవడంతో నష్టపోతున్నారు. అందుకు వ్యాపారులు సాహసించటం లేదు.

–తాత్రాజు అప్పారావు, అధ్యక్షుడు, బాయిలర్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ ఆఫ్ గ్రేటర్ విశాఖ

ఘనంగా గీతం స్నాతకోత్సవం

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గీతం చాన్సలర్ డా.వీరేంద్ర సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో తేజ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.కోట హరినారాయణకు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్), ప్రముఖ నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ డిలిట్‌ను అందజేశారు. స్నాతకోత్సవానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి డా.ఎస్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో భారతదేశం గణనీయ ప్రగతిని సాధిస్తుందని, పరిశోధనల్లో, శాస్త్ర ప్రచురణల్లో, పేటెంట్ల నమోదుల్లో ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. నటి వాణిశ్రీ మాట్లాడుతూ తన భర్తతో సహా అందరూ తమ ఇంట్లో డాక్టర్లేనని ఈ గౌరవ డాక్టరేట్‌తో తన పేరు ముందు డాక్టర్ జోడించుకునే భాగ్యం దక్కిందన్నారు. విశాఖ ప్రాంగణం నుంచి 2022–23లో వివిధ కోర్సులు పూర్తి చేసిన 2,769 మంది పట్టభద్రులకు స్నాతకోత్సవ డిగ్రీలను, 84 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్, ఉపాధ్యక్షుడు ఎమ్.గంగాధరరావు, కార్యదర్శి ఎం.భరద్వాజ్ పాల్గొన్నారు.

వేసవి సెలవులు పొడిగించాలి

విశాఖ విద్య: రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలలకు వేసవి సెలవులను ఈ నెలాఖరు వరకు పొడిగించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు డాక్టర్ గొండు సీతారాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున.. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ సంస్థల నుంచి ఇదే విషయమై కమిషన్‌కు అధిక సంఖ్యలో లేఖలు అందుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నెలాఖరు వరకు పాఠశాలలకు వేసవి సెలవులు పొడిగించాలని కోరారు.

యోగాలో కనకారావు రికార్డు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రంతో కనకారావు

పీఎం పాలెం: యోగాలో పెదరెడ్ల కనకారావు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. సలాంబ సర్వంగాసనా (ది ఆల్ లింబ్స్ పోజ్) అనే భంగిమలో ఆయన ఈ రికార్డు క్రియేట్ చేశారు. పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో నివసిస్తున్న కనకారావు 20 ఏళ్లుగా మార్షల్ ఆర్ట్స్‌తో పాటు యోగాసనాలు వేయడంలోనూ దిట్ట. యోగాలో కనబరిచిన ప్రతిభకు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. స్థానిక డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్‌లో ప్రధాన శిక్షకుడిగా ఉన్నారు. ఈ ఏడాది మార్చిలో సలాంబ సర్వంగాసనాలో నాలుగు నిమిషాల 25 సెకండ్ల పాటు వేసిన ఆసనాన్ని వీడియో తీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించాడు. ఇప్పటి వరకు 4.25 సెకండ్లు సలాంబ సర్వంగాసనా ఆసనం వేసినట్టు ఎక్కడా నమోదు కాలేదు. దీంతో కనకారావుకు ఈ గుర్తింపు లభించింది. శనివారం కొరియర్ ద్వారా బంగారు పతకం, ధ్రువీకరణ పత్రంతో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పుస్తకాన్ని పంపించారు. దీంతో కనకారావును పలువురు అభినందించారు.

వెల్‌నెస్ సెంటర్‌లో ఆయుర్వేద, హోమియో వైద్య సేవలు

ఏయూక్యాంపస్: ఈఎన్‌టీ ఆస్పత్రి రోడ్డులోని కేంద్ర ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం ఆయుర్వేదం, హోమియోపతి విభాగాలు ప్రారంభమయ్యాయి. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీసీహెచ్ కోటేశ్వరరావు, డాక్టర్ శ్యామ్ కిశోర్‌బాబు ఈ విభాగాలను ప్రారంభించారు. డాక్టర్ గుప్తేశ్వర్ మిశ్రా ఆయుష్ విభాగంలో, డాక్టర్ అనిషధ్ హోమియోపతి విభాగంలో సేవలందిస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా.. 2017లో ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు సేవలందుతున్నాయి. రోజుకు 300 మంది వరకు ఓపీ నమోదవుతుంది. ఈ కేంద్రం పరిధిలో 13 వేల కార్డులు ఉంగా.. 30 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. పింఛనర్ల సంఘం, సీజీహెచ్ఎస్ లబ్ధిదారుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు, నాయకులు కె.రవిబాబు, కె.వి.డి.స్వామి, బి.డి.రాజు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులు కొత్త ప్రదేశాల్లో చేరాలి

విశాఖ విద్య: బదిలీ అయిన ఉపాధ్యాయులంతా తక్షణమే రిలీవ్ అయి, కొత్త ప్రదేశాల్లో చేరాలని ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. శనివారం ఆమె ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎంఈవో, డిప్యూటీ డీఈవోలతో వెబెక్స్ నిర్వహించారు. పదోన్నతులు పొందిన వారు, 8 ఏళ్ల సర్వీసు పైబడి తప్పనిసరి బదిలీ అయిన వారు, సర్‌ప్లస్ ఉపాధ్యాయులు వెంటనే ప్రస్తుత చోట రిలీవ్ అయి, నూతన ప్రదేశాల్లో చేరాలన్నారు. ఈ విషయంలో ఏఈవోలు తగిన శ్రద్ధ తీసుకొని, బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు బదిలీ అయినప్పటికీ, స్కూల్ మూత పడకుండా, అతని చోటుకు మరొక ఉపాధ్యాయుడు వచ్చిన తరువాతనే రిలీవ్ కావాలన్నారు.